పోషణ్ పక్వాడా పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో పిల్లలకు నాణ్యమైన పోషణ, ప్రాథమిక విద్యను అందించేందుకు పోషణ పక్వాడా కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన హబ్ అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు పోషణ్ పక్వాడా పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. చిన్నారుల ఆరోగ్యాన్ని, ఆహారపు స్థితిని మెరుగుపరచడానికి పోషణ పక్వాడా కార్యక్రమం దోహదపడుతుందన్నారు. జిల్లాలో 131 అంగన్‌వాడీ కేంద్రాలను హబ్ మోడల్ కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్, ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నీళ్ల కోసం రోడ్డెక్కే పరిస్థితి తీసుకురావద్దు

- జల్ జీవన్ పనులు ఎప్పుడో చేస్తామంటే కుదరదు
- వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- చోడవరం సిఎఫ్, సిసి అవినీతిపై విచారణకు ఆదేశం
- ఉపాధి కూలీలపై ఎచ్చెర్ల ఎంపిపి అక్కసు

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, పక్కన జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వేసవి నేపథ్యంలో తాగునీటి కోసం ప్రజలు రోడెక్కే పరిస్థితి తీసుకురావద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. జెడ్‌పి మాజీ చైర్మన్ పాలవలస రాజశేఖరం మృతికి సంతాప సూచకంగా సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తాగునీటి కోసం ప్రజలు ఆందోళన చేసినా, పత్రికల్లో క్లిప్పింగ్స్ వచ్చినా ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. తమ మండలాల్లో జల్ జీవన్ మిషన్ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని, పైపులు కొనుగోలు చేసి వదిలేశారంటూ పలువురు సభ్యులు మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సమస్యలతో పాటు పలు ప్రభుత్వ శాఖల ప్రగతిపై సభ్యులు చర్చించారు.

గ్రామీణ నీటి సరఫరా పనితీరుపై తొలుత సభ్యులు సమీక్షించారు. మండలాల్లో జల్ జీవన్ పనులు జరగడం లేదని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కంచిలి ఎంపిపి పైల వాసుదేవరెడ్డి మాట్లాడుతూ వేసవి వచ్చినా నీళ్లు ఇవ్వకపోవడం సిగ్గేస్తోందన్నారు. పనులు ఎందుకు జరగడం లేదంటూ ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ఎహసాన్ బాషాను మంత్రి ప్రశ్నించారు. పనులు చేస్తామని కాంట్రాక్టర్ చెప్పారంటూ ఆయన బదులిచ్చారు. దీనిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీటి పథకాలకు పంచాయతీలు డబ్బులు ఇవ్వాల్సిందేనని, ఇవి వారి డబ్బులు అంటే కుదరదన్నారు. వేసవి నేపథ్యంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించి తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని ఎస్‌ఇని ఆదేశించారు.

నరసన్నపేట సిఎఫ్, సిసి అవినీతిపై చర్యలు

నరసన్నపేట మండలం చోడవరం సిఎఫ్, సిసి సుమారు రూ.80 లక్షల అవినీతికి పాల్పడ్డారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. డ్వాక్రా మహిళల సొమ్ములను తమ ఖాతాలో వేసుకున్నారని చెప్పారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ విచారణ కమిటీ వేసి, నిర్ధారణ అయితే డబ్బులను రికవరీ చేయాలన్నారు. క్రిమినల్ కేసులను నమోదు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

విద్యుత్ స్తంభాలను మార్చడానికి పంచాయతీ నిధులు

పంచాయతీల్లో రోడ్ల విస్తరణ తర్వాత రోడ్ల మధ్యలో స్తంభాలు ఉండిపోయాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. స్థంబాలను మార్చేందుకు విద్యుత్‌శాఖకు నిధులు వెచ్చించే అవకాశం లేదని, పంచాయతీ నిధులు ఇవ్వాలని డిపిఒ భారతీ సౌజన్యకు సూచించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ సాధ్యాసాధ్యాలను పరిశీలించి చూస్తామని ఆమె బదులిచ్చారు.

వైసిపి మాదిరిగా పనులు ఆపేయలేం

పంచాయతీరాజ్‌శాఖ ప్రగతిపై చేపట్టిన సమీక్ష సందర్భంగా జిల్లాలో పలు గ్రామాలను అనుసంధానం చేసే రోడ్డు వంతెన పనులు ఆగిపోయాయని పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ 2019లో ఎఐఐబి ద్వారా పనులు చేపట్టాలని అనుకున్నామని, టిడిపి ప్రభుత్వం ఓడిపోవడంతో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వాటిని ఆపేసిందన్నారు. వైసిపి ప్రభుత్వం గతంలో ప్రారంభించిన భవనాలను తాము ఆపేయడం లేదని, అది తమ విధానం కాదని చెప్పారు.

కుదించిన పోస్టుల జాబితాలు సిద్ధం చేయండి

గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖలపై సమీక్ష సందర్భంగా డివిజన్లు ఎత్తేయడంతో అధికారులు ఇతర జిల్లాలకు వెళ్లి పోయిన అధికారుల జాబితాను సిద్ధం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ఆదేశించారు.

ఉపాధి కూలీలపై ఎచ్చెర్ల ఎంపిపి అక్కసు

ఉపాధి కూలీలపై ఎచ్చెర్ల ఎంపిపి మొదలవలస చిరంజీవి తన అక్కసు వెళ్లగక్కారు. తమ మండలంలో పనులు చేయకుండానే కూలీలకు డబ్బులు వచ్చేస్తున్నాయని అన్నారు. ఉపాధి పనులు కూలీలు వెళ్లిపోవడంతో వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదన్నారు. ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానించేలా చూడాలని కోరారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ చాలా కాలంగా మేమూ అదే అడుగుతున్నామని, ఇప్పుడు ఉద్యాన పంటలకు ఉపాధి హామీని అనుసంధానించడం కొంతమేర ఉపయోగపడుతుందని చెప్పారు.

ప్రొటోకాల్ పాటించపోవడంపై ఫిర్యాదు చేస్తా : ఎమ్మెల్సీ

పాలకొండ ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశానికి తనను పిలవకుండా అవమానించారంటూ ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సభా హక్కుల కమిటీకి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. జిల్లాలో అధికారులంతా తప్పనిసరిగా ప్రోటోకాల్ పాటించాల్సిందేనని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

సూపర్ సిక్స్ ప్రస్తావనపై అచ్చెన్న తీవ్ర స్పందన

ప్రోటోకాల్ అంశంపై మాట్లాడుతున్న సందర్భంలో ఎమ్మెల్సీ విక్రాంత్ సూపర్ సిక్స్ హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని అడిగారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. సూపర్ సిక్స్ హామీలపై ఎవరికీ సందేహం అవసరం లేదని, కూటమి ప్రభుత్వం వాటి అమలుకు కట్టుబడి ఉందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం గత ఐదేళ్లలో ఏం చేసిందో అందరికీ తెలుసునన్నారు. నాలుగు సంక్షేమ పథకాలు ఇస్తే సరిపోదన్నారు.

పరిశ్రమలను అడ్డుకుంటే ఎవరు వస్తారు?

జిల్లాలో ఎయిర్‌పోర్టు కడతామంటే వద్దని అడ్డుకుంటున్నారంటూ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. మూలపేట పోర్టును ఆ రోజు తాను అడ్డుకుంటే ఇప్పుడు పనులు జరిగేవా అని ప్రశ్నించారు. కాకరాపల్లి, సోంపేటలో కాల్పులు జరిగాయని, ఇలా అయితే పరిశ్రమలు పెట్టడానికి జిల్లాకు ఎవరు వస్తారని ప్రశ్నించారు. సమావేశంలో జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, తూర్పు కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశ్వసిని, పలువురు ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

'ఫలక్‌నుమా'కు తప్పిన ముప్పు

- విరిగిన బఫర్
- రైలు నుంచి వేరైన 15 బోగీలు

ప్రజాశక్తి - పలాస

సికింద్రాబాద్ నుంచి హౌరాకు వెళ్తున్న ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12704) రైలుకు మంగళవారం ప్రమాదం తప్పింది. రైలు బోగీలను కలిపే బఫర్ విరిగిపోవడంతో రైలు నుంచి 15 బోగీలు వేరయ్యాయి. మరమ్మతుల అనంతరం మూడు గంటల తర్వాత రైలు హౌరా బయలుదేరింది. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ మంగళవారం ఉదయం 6.57 గంటలకు పలాస రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. పలాస రైల్వేస్టేషన్‌కు సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో సుమ్మాదేవి రైల్వేస్టేషన్ వద్దకు వెళ్లేసరికి రైలుకు ఉన్న మొత్తం 23 బోగీల్లో ఎనిమిదో బోగీ ఎసి కంపార్ట్‌మెంట్ వద్ద బఫర్ విరిగిపోయింది. రైలు ఇంజిన్ వెనుక ఎనిమిది బోగీలు వెళ్లగా, వెనుక ఉన్న 15 బోగీలు పట్టాలపై నిలిచిపోయాయి. రైలులో చైన్ లాగడంతో రైలు ఆగిపోయిందని గార్డు మధుకుమార్ భావించారు. రైలు దిగి చూడగా, బోగీల నుంచి రైలు వేరుగా వెళ్లిపోవడాన్ని గుర్తించి డ్రైవర్ ఆర్.ఖాన్‌ను అప్రమత్తం చేశారు. దీంతో ఆయన రైలును నిలుపుదల చేశారు. సమాచారం అందుకున్న రైల్వే డిప్యూటీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవతిరావు, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్‌పిఎఫ్ ఎస్‌ఐ మాల్యాద్రి, మందస రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ గంటా హరిగోపాల్ ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని బఫర్ విరిగిపోయినట్లు గుర్తించారు. 110 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో వెళ్లాల్సిన రైలు, అప్ లైన్ కావడంతో ఆ సమయంలో 75 కిలోమీటర్ల వేగంతో నెమ్మదిగా వెళ్లడంతో ప్రమాదం తప్పింది. ఎనిమిది బోగీలతో ఉన్న ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌ను మందస రైల్వేస్టేషన్‌కు చేర్చగా, మరో ఇంజిన్ సహాయంతో వేరైన 15 బోగీలను మందస రైల్వేస్టేషన్‌కు తీసుకొచ్చారు. విరిగిన బఫర్ బోగీని అక్కడ విడిచిపెట్టి ఆ బోగీలో ఉన్న 42 మంది ప్రయాణికులను వేరే బోగీల్లోకి తరలించారు. భువనేశ్వర్ వద్ద కొత్త కోచ్‌ను ఏర్పాటు చేసి వారికి వసతి కల్పిస్తామని అధికారులు తెలిపారు. మొత్తం 3 గంటల పాటు రైలు మందసలో నిలిచిపోయింది. 10.20 గంటల సమయంలో మందస రైల్వేస్టేషన్ నుంచి రైలు హౌరా బయలుదేరింది. ఈ కారణంగా పలాస నుంచి భువనేశ్వర్ వెళ్లే పలు రైళ్లు మూడు గంటల పాటు ఆలస్యంగా నడిచాయి. మూడు గంటల పాటు రైలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

విరిగిపోయిన బఫర్

ఇంజిన్ నుంచి విడిపోయిన బోగీలు

మినీ రిజర్వాయర్ ఏర్పాటు చేయాలి

గెడ్డలు, కాలువలను పరిశీలించిన రైతుసంఘం ప్రతినిధి బృందం

పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - మందస

మందస లోని మహేంద్రగిరి నీటిని 'అంబుగైరి' నుంచి గోపాలసాగరానికి మళ్లించి మినీ రిజర్వాయర్‌గా ఏర్పాటు చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, మండల కార్యదర్శి మట్ట ధర్మారావు, వి.గోపాలకృష్ణ, గణేష్ సాహు డిమాండ్ చేశారు. మండలంలోని గోపాలసాగరం, చీపి నుండి సాబకోట వరకూ ఉన్న గెడ్డలు, కాలువలను రైతుసంఘం ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేంద్రగిరుల నుంచి నిత్యం ప్రవహిస్తున్న నీరు నిరుపయోగంగా సముద్రంలో కలిసిపోతోందని చెప్పారు. ఆ నీటిని సాబకోటకు వద్దనున్న అంబుగైరికి దిగువున రాజపురంపైన చెక్‌డ్యామ్ నిర్మించి బుడుంబో, భావనాపురం, కారిగాం మీదుగా బుడిగాటి నుంచి కాలువ తవ్వి గోపాలసాగరానికి మళ్లించాలన్నారు. వృథాగా పోతున్న నీటిని సాగు భూములకు మళ్లిస్తే సుమారు 20 గ్రామాల్లోని ఆరు వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని చెప్పారు. గిరిజన గ్రామాల భూములకు సాగునీరు అందివచ్చని చెప్పారు. ప్రభుత్వం స్పందించి ఈ ప్రాజెక్టు రూపకల్పనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు, రైతులు కడమట కేశవరావు, సిందిరి, వల్లభ, అల్లాడ రాజులు, కోరాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మే 10న జాతీయ లోక్ అదాలత్

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జాతీయ లోక్ అదాలత్‌ను మే పదో తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ జిల్లా అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా వెల్లడించారు. జిల్లా కోర్టుతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు, పాలకొండ, రాజాం కోర్టుల్లో ఆరోజున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కోర్టు భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేసి పని భారం తగ్గించుకోవాలన్నారు. రాజీ పడదగిన క్రిమినల్, సివిల్, బ్యాంకు సంబంధించిన కేసులను జాతీయ లోక్ ఆదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. ఇన్సూరెన్స్ అధికారులు ఎక్కువ సంఖ్యలో మోటారు వాహన ప్రమాద కేసులను రాజీ చేయడం ద్వారా ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లు న్యాయ వ్యయాలను తగ్గించి, వేగవంతమైన న్యాయం అందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీ చేపడుతున్న దళిత సంఘాల నాయకులు

వర్గీకరణను సమిష్టిగా అడ్డుకుందాం

దళిత సంఘాల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వర్గీకరణ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల మధ్య చిచ్చు పెడుతున్నాయని, దళితులంతా సమిష్టిగా వర్గీకరణను అడ్డుకోవాలని ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక ఉద్యమ కమిటీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.బెంజిమెన్ పిలుపునిచ్చారు. నగరంలోని ఆదివారంపేటలో గల అంబేద్కర్ విగ్రహం నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు మంగళవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ కళావేదికలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.రాజ్యాంగ విరుద్ధంగా స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దళితుల మధ్య చిచ్చు పెట్టి వివాదాలు సృష్టిస్తున్నాయని విమర్శించారు. సుప్రీంకోర్టు సూచనలను ప్రాతిపదికగా తీసుకోకుండా పార్లమెంట్‌లో ఎస్‌సి వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించకుండా విభజన చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. వర్గీకరణ సాధ్యం కాదని తెలిసినా, అధికారం కోసం కొందరిని అడ్డం పెట్టుకొని కులాల వారీగా విభజిస్తున్నారని ధ్వజమెత్తారు. ఎబిసిడి వర్గీకరణకు హేతుబద్ధత లేదన్నారు. దీన్ని అడ్డుకుని తీరుతామని, అవసరమైతే ఢిల్లీలో నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టే ఉద్యమానికి భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత తహశీల్దార్ ఎం.అంబేద్కర్, దళిత సంఘాల నాయకులు రామప్పడు, సంజీవరావు, ఆర్.సూర్యనారాయణ, డి.గోవిందరావు, కె.తవిటయ్య, గంజి ఆర్.ఎజ్రా, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు హోం మంత్రి అనిత రాక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత బుధవారం జిల్లాకు రానున్నారు. పర్యటనలో భాగంగా ఎస్‌పి కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షించనున్నారు. అనంతరం రెండు గంటలకు నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని రామాంజనేయ అపార్ట్‌మెంట్‌లో కేన్సర్ పేషెంట్ లతశ్రీని పరామర్శించనున్నారు.

క్వారీ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి - పలాస

పురుషోత్తపురం కొండపై క్వారీ తవ్వకాల వల్ల స్థానికులకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఆ తవ్వకాలను నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ శిష్టు బృందావతి, కోఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ కోరారు. పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. క్వారీ తవ్వకాలపై మున్సిపాల్టీకి సమాచారం ఉందా, ఉంటే తవ్వకాలు చేసి ఎక్కడికి తరలిస్తున్నారో చెప్పాలన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ ఎన్.రామరావు మాట్లాడుతూ తవ్వకాలపై సమాచారం లేదని, రెవెన్యూ అధికారుల నుంచి సమాచారం సేకరించి మున్సిపాలిటీ ఆస్తులు పరిరక్షించే చర్యలు చేపడతామన్నారు. దీనిపై కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ గతంలో తనకు అన్ని అనుమతులతో క్వారీ లీజుకు ఇచ్చారని, కూటమి ప్రభుత్వం వచ్చాక కేంద్రీయ విద్యాలయానికి స్థలం అవసరమని తెలుసుకుని తానే ప్రభుత్వానికి ఇచ్చేశానన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు క్వారీ నుంచి ఎంఐజి లేఅవుట్‌కు మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. సూదికొండ ప్రాంతంలో సుమారు రూ.కోటి మట్టి తవ్వకాలు జరిగాయని, దానిపై విచారణ చేపట్టి తవ్వకాలు చేపట్టిన వారి నుంచి రికవరీ చేయాలని కోరారు. మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు తెలిపారు.

చైర్మన్, కౌన్సిలర్ మధ్య వాగ్వివాదం

సమావేశంలో తాగునీటి పైపులైన్ల నిర్మాణాలపై కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా ప్రశ్నించగా, చైర్మన్ గిరిబాబు అడ్డుకున్నారు. అజెండా పూర్తయిన వరకు ఎవరూ ప్రశ్నలు వేయొద్దన్నారు. అజెండా పూర్తయిన తర్వాత అడగాలంటే అంతవరకు అలా కూర్చోవాలా అని ప్రశ్నించారు. చైర్మన్‌గా తనకు అధికారం ఉందని, తన ఇష్టం వచ్చినట్లు నిర్వహిస్తానన్నారు. అత్యవసర సమావేశమంటే వచ్చామని, ఏమీ మాట్లాడకుండా సంతకం పెట్టి వెళ్లిపోమంటే వెళ్లిపోతామని దుర్గాశంకర్ అన్నారు. దీనిపై చైర్మన్ స్పందిస్తూ చైర్మన్‌ను అవమానిస్తూ మాట్లాడడం సరికాదని, క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర బుజ్జి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రణాళికలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్

మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించినట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో కలిసి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో అభివృద్ధి పనుల పురోగతిపై పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా నరేగా కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.500 కోట్ల మెటీరియల్ కాంపొనెంట్ పనులు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. భూగర్భజలాల పెంపునకు చెక్ డ్యామ్‌లు, ఇంకుడుగుంతలు, పల్లె పుష్కరణిలు, ఫిష్ డ్రై ప్లాట్‌ఫాంలు, ఫామ్ పాండ్స్ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో నిర్మాణాత్మక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. 2014-19 మధ్య కాలంలో నిర్మించిన చెత్త నుంచి సంపద యూనిట్లను తిరిగి ఉపయోగంలోకి తేవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో గుంతల్లేని రోడ్ల పనులు ఇప్పటికే 96 శాతం పూర్తయ్యాయని, వేసవి ముగిసేలోపు మిగిలిన పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఆమదాలవలస-శ్రీకాకుళం రోడ్డు విస్తరణ పనుల్లో శ్రీకాకుళం నగర పరిధిలో ఆస్తి నష్టం వాటిల్లే వారికి రూ.ఏడు కోట్ల నష్టపరిహారం మంజూరుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పెద్దపాడు రోడ్డు విస్తరణలో భాగంగా కొత్త విద్యుత్ స్తంభాల కోసం రూ.35 లక్షలు కలెక్టర్ నిధుల నుంచి మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రాగోలులో జెమ్స్ ఆస్పత్రి సమీపంలో రూ.2.92 కోట్లతో సైనిక్ భవన్ నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన జరగనున్నట్లు వెల్లడించారు. కోడి రామ్మూర్తి స్టేడియం పనుల పురోగతిపై సమీక్షించాలని, కలెక్టరేట్ ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాకకు వీలుగా అనుకూల సమయాన్ని చూడాలని సూచించారు. వంశధార శివారు భూములకు ఈ ఏడాది నీరందించేలా ఇప్పట్నుంచే ప్రణాళికలు సిద్ధం చేయాలని, షట్టర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూడాలని ఆదేశించారు. జిల్లాలో టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని మంత్రులు ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో చర్యలు తీసుకోవాలని మంత్రులు సూచించారు. టెక్కలిలో ఇందుకోసం 20 ఎకరాలు సిద్ధం చేయాలని మంత్రి శ్రీనివాస్ అన్నారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల అభిప్రాయాల మేరకు స్థల సేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, మామిడి గోవిందరావు, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవ సీనియర్ సివిల్ జడ్జి సోంపేట వారి కోర్టులో
H.M.O.P. 102/2024

Between :-
బురద జ్యోతి ......పిటిషినరు
మరియు :-
బురద సురేసు ......రెస్పాండెంట్
To
బురద సురేసు, తండ్రి లేటు పాపయ్య, వయస్సు 35 సం. హంసరాలి గ్రామ నివాసి, మందస మండలం, శ్రీకాకుళం జిల్లా,

పై నెంబర్ గల కేసులో పిటిషనరు, రెస్పాండెంట్ పై విడకులకు పై కోర్ట్‌లో పిటిషను వేసియున్నారు. మీకు కోర్ట్ వారు నోటీసులు పంపినప్పటికి మీరు నోటీసులు తీసుకోలేదు. కావున పై కేసు శ్రీ గౌరవ సీనియర్ సివిల్ జడ్జ్ సోంపేట వారి కోర్ట్ లో తేదీ. 15.04.2025 నాటికి వాయిదా అయ్యిఉన్నది. కావున మీరు స్వయానా గాని, మీ వకీలు ద్వారా గాని **తేదీ. 15.04.2025 ఉదయం 10.30 గం.**లకు పై కోర్ట్ కి హజరై మీ యొక్క ఆక్షేపణలు కోర్టు వారికి తెలియ జేయాలి లేని యెడల మీకు పరోక్షం గా పై వాజ్యములో తీర్పు ఇవ్వబడును.

ఇట్లు
దువ్వు జగన్నాయికులు
న్యాయవాది, సోంపేట

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
I.A.353/2024 IN O.S.211/2015.

Between:
1) Kshatri Maheswar Singh (Since died).
2) Kshatri venkata Ganes Singh.
3) Kshatri vikram Singh.
4) Kshatri Rajesh Singh.
...Petitioners 2 to 4/Proposed Plaintiffs 2 to 4.
And:
1) Inapakurthi Ananda Rao and others.
.....Respondents-Defendants.
To
R3) Rakoti Bhulakshmi, W/o Late Parasuram, Door No. 16-10-62/8, Gunapalem, Srikakulam Town, Srikakulam Municipality and District.
R4) Rakoti Durga Venkata Ramana Prasad, S/o Late Parasuram, -rest-do.

NOTICE

Take notice that the application by the above is posted for hearing at **10-30A.M., on 28-04-2025** before the above said court and it you want to contest the matter your may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause matter will be decided in your absence and expert.

By court order.

Chigurupalli Rama Mohan,
Advocate,
Dhavala Colony, G.T.Road,
Srikakulam Town and District
Cell:19440116221

IN THE COURT OF THE HON'BLE MACT-CUM XXVII ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT AT:: SECUNDERABAD
M.V.O.P No. 601 OF 2024

Between:
Pappala Sridevi & others
...Petitioners
AND
K. Rajendra Santrisi & others
...Respondents

R-1. K. Rajendra Santrisi @ K. Ranjendra, S/o. Santrasi Jholi, aged about 25 years, Occ: Driver of crime vehicle, R/o. H.No. 5-66, Relli street, Battili, Bhamini, Srikakulam, Andhra-pradesh, Pin. 532456.

Please take notice that the above-named petitioner filed the above case, claiming compensation for Death of Pappala Sugrivulu S/o. H. Ramulu, in the accident that occurred 10.02.2024 due to the rash and negligent driving of driver of the crime vehicle Toyota car B.No. OD-07-A-2828 against you. You are here by summoned to appear before this Hon'ble court in person or through your counsel on: 25-04-2025 At: 10:30 A.M and the case is posted for your appearance and counter on the above said date, failing which, matter will be decided against you as per Law.

"By order of the Hon'ble court"

J.RAMESH M.A, LL.M,
Advocate,
Office: Plot No. 75, New, Bhavani Nagar, Road No.4. Boduppal, Medchal-Malkajgiridist
Cell No: 9948374599

జిజిహెచ్‌లో రోగుల అవస్థలు

అవస్థలు పడుతున్న రోగి బంధువులు

ప్రజాశక్తి- గుజరాతీపేట

జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులు, ప్రత్యేకంగా వృద్ధులు, శారీరకంగా బలహీనులైనవారు నానా అవస్థలు పడుతున్నారు. ఆస్పత్రిలో ఉన్న లిఫ్ట్ పనిచేయక పోవడంతో 4 నుంచి ఐదు అంతస్తులు నిరంతరం ఎక్కిదిగాల్సి వస్తోంది. ఇది రోగుల ఆరోగ్య పరిస్థితిని మరింత గందరగోళంగా మారుస్తోంది. ఆస్పత్రిలో ఒక వృద్ధురాలు ఒపి కోసం నిలబడి చాలా సమయం తర్వాత ఒపి తీసుకుని ఏ వార్డుకు వెళ్లాలో దారి తెలియక ఒపి రశీదు పట్టుకుని లిఫ్ట్ పనిచేయక పోవడంతో మెట్లెక్కుతూ అన్ని అంతస్తులు తిరుగుతూ నానా అవస్థలు పడింది. ఎక్కడికి వెళ్లాలో చెప్పేవారు లేక దిక్కుతోచని స్థితి నెలకొంది. కనీసం రోగులు కూర్చోవడానికి స్థలం లేకపోవడం, తాగునీరు అందుబాటులో లేకపోవడంతో జిల్లా నలుమూలల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగులు ఈ సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఆస్పత్రి నిర్వహణలో లోపాలు మార్పు చెందడం లేదు. రోజురోజుకూ రోగుల కష్టాలు పెరుగుతున్నాయి.

తాగునీటి కొరత

ఆస్పత్రిలో తాగడానికి నీరులేక రోగులు ఆస్పత్రి ప్రాంగణంలోనే దూరంగా వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. ఇదే విషయాన్ని సూపరింటెండెంట్ దాసరి షకీల వద్ద ప్రజాశక్తి వివరణ కోరగా కోకోకోలా సౌజన్యంతో రెండు ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారని, మరో మూడు ప్లాంట్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. త్వరలో పూర్తిస్థాయిలో తాగునీరు ఏర్పాటు చేసి రోగులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

కుర్చీలు లేక మెట్లపై కూర్చున్న రోగులు

నిలిచిన తవ్వకాలు

మట్టి తవ్వకాలు నిలిపివేత

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- లావేరు

మండల కేంద్రం లావేరులో ఎర్ర చెరువులో అక్రమంగా మట్టి కంకర తవ్వకాలపై రెవెన్యూ అధికారులు స్పందించారు. 'యథేచ్ఛగా మట్టి కంకర తవ్వకాలు' అనే శీర్షికతో 'ప్రజాశక్తి'లో ఈ నెల 7న కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. తవ్వకాలు జరిగే చెరువును సోమ, మంగళవారాలు రెవెన్యూ అధికారులు పరిశీలించారు. దీంతో అక్రమార్కులు ఎక్కడ వారు అక్కడే జాగ్రత్త పడి తవ్వకాలను నిలుపుదల చేశారు. ఎర్ర చెరువులో ఎంత మేర తవ్వకాలు చేపట్టారో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆర్.అప్పలరాజు, విఆర్‌ఒ వేణుగోపాల్‌లు ఫొటోలు తీసి తహశీల్దార్‌కు నివేదిక పంపించారు. అక్రమార్కుల వివరాలు సేకరించి నోటీసులు అందజేసే పనిలో అధికారులు తలమునకలై ఉన్నారు.

పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలి

కొత్తూరు: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అధిక ధరలతో సామాన్యుల నడ్డివిరుస్తున్న కేంద్ర ప్రభుత్వం తాజాగా గ్యాస్ గృహ వినియోగ సిలిండర్‌పై రూ.50, పెట్రోల్, డీజిల్ లీటర్‌పై రూ.2లు పెంచిందన్నారు. ఇప్పటికే నిత్య అవసరాల ధరల పెరుగుదలతో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న ప్రజలపై తీవ్ర భారాన్ని మోపుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆదివాసీలపై వేధింపులు ఆపాలి

మెళియాపుట్టి: మండలంలోని ఆదివాసీలపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసులు తప్పుడు కేసులు పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని, తక్షణమే ఆదివాసీలపై వేధింపుల ఆపాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకల మాధవరావు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పుడు కేసులు పెట్టి అన్యాయంగా అపోజిపేటకు చెందిన ఇద్దరు ఆదివాసీలను అరెస్టు చేశారని తెలిపారు. నిజంగా సారా తయారు చేసే వారి పైన చర్యలు తీసుకుంటే అభ్యంతరం లేదన్నారు. అమాయకులపైన, గతంలో పేర్లు ఉన్నాయని వలసలు వెళ్లిన వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం తహశీల్దార్ బడే పాపారావుకు వినతిపత్రం అందజేశారు. మండల అధ్యక్షులు సవర శ్రీను, సవర భాస్కరరావు, అపోజిపేట, దారిపేట, కొత్తపేట, కుర్మన్నపేట ఆదివాసీలు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీలు

నిరుపయోగంగా భవనాలు

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల అనుబంధ బాలికల వసతిగృహాన్ని సమగ్ర శిక్షా అభియాన్ ఫేజ్ 2 కింద రూ.194.21 లక్షలతో ఐదేళ్ల క్రితం నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి 2018లో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణం పూర్తయిన తర్వాత 2021లో అప్పటి ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారంబభించారు. అయితే ఈ భవనం ప్రారంభించి నాలుగేళ్ల అవుతున్నా అందులో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించడం లేదు. భవనాన్ని ప్రారంభించి అలాగే ఉండిపోవడంతో ప్రజాధనం వృథా వదిలేశారని చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాల రహదారిలోని ఎస్‌సి బాలురు వసతిగృహంలోకి రహదారిపై ఉన్న మరుగు, వర్షపునీరు వెళ్లిపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వసతిగృహాన్ని వినియోగించుకోవాలని కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న వసతిగృహం

మానవ హక్కుల సంఘం విద్యార్థి విభాగం

రాష్ట్ర అధ్యక్షునిగా భవానీప్రసాద్

బూర్జ : మండలంలోని రామన్నపేటకు చెందిన వావిలపల్లి భవానీప్రసాద్ అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. భవానీప్రసాద్ నియామకంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

భవానీప్రసాద్

విద్యుత్ సమస్యలపై వినతి

కవిటి: శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని మండలంలోని జగతి పంచాయతీ బట్టివానిపాలెం గ్రామస్తులు కోరారు. ఈ మేరకు రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలో విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని ఆందోళన వ్యక్తం చేశారు, విద్యుత్ సరఫరాలో కూడా అవాంతరాలు ఎదురవుతున్నట్టు తెలిపారు. తమ గ్రామానికి కొత్త విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జి.ధనరాజ్, సిహెచ్.లక్ష్మీనారాయణ, సిహెచ్.హేమరాజు, కె.సురేష్, సిహెచ్.విజయ్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న బట్టివానిపాలెం గ్రామస్తులు

కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

లావేరు : ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు

రీ సర్వేతో భూ సమస్యల పరిష్కారం

కవిటి: సమగ్ర రీ సర్వేతో భూ సంబంధిత సమస్యలు పరిష్కారమవుతాయని తహశీల్దార్ ఎం.మురళీమోహన్ తెలిపారు. మండలంలోని డి.జి.పుట్టుగలో రీ సర్వే ప్రారంభోత్సవ ర్యాలీ, గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎప్పటినుంచో అపరిష్కృతంగా ఉన్న భూ సంబంధిత సమస్యలకు రీ సర్వేలో పరిష్కార మార్గం దొరుకుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కృష్ణమూర్తి, సర్పంచ్ బెందాళం కిరణ్ కుమారి, పండి దేవేంద్రమూర్తి, ఎంపిటిసి చందాన పూర్ణచంద్రరావు, జల్లు యుగంధర్, ఆర్ఐ రమణమూర్తి, సర్వేయర్ మల్లికార్జున్ పాణిగ్రాహి, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

లావేరు : ఎటువంటి భూ సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎన్ని జోగారావు తెలిపారు. మండలంలోని వెంకటాపురంలో భూ రీ సర్వేపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో మాట్లాడుతూ ఈ రీ సర్వే వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ బి.శ్రీధర్‌రెడ్డి, టిడి ఎం.తిరుపతిరావు, సర్పంచ్ బొంతు ఎల్లంనాయుడు, టిడిపి నాయకులు ఎస్.రమేష్, విఆర్‌ఒ శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.రమణ తదితరులు పాల్గొన్నారు.

మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొస్తున్న మత్స్యకారులు

చేపలు పడుతూ మత్స్యకారుడు మృతి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘ పరిధిలోని నాలుగో వార్డు పరిధిలోని గేదెలవానిపేట-కసింవలస మధ్యలో ఉన్న ఊర చెరువులో చేపల వేటకు దిగి మత్స్యకారుడు గయా బాల (47) మృతి చెందాడు. సోమవారం రాత్రి తోటి మత్స్యకారులతో కలిసి చేపల వేటకు బాల వెళ్లాడు. తోటి మత్స్యకారులు చెరువులోనుంచి ఒడ్డుకు చేరుకున్నారు. ఇంతలో బాల కనిపించకపోవడంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే అప్పటికే చెరువు మధ్యలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. వెంటనే మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహాల య్యాయి. కుటుంబ పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న శ్రీకాకుళం రూరల్ పోలీసులు సందర్శించి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన ఉపాధి కూలి తులసమ్మ

'ఉపాధి' కూలీకి గాయాలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పట్టుపురం పంచాయతీలో మంగళవారం ఉపాధి హామీ పనిప్రదేశంలో మహిళకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన గోసాల చెరువు వద్ద చేపడుతున్న ఉపాధి హామీ పని వద్ద తమ్మినేని తులసమ్మ పనులు చేస్తుంది. ఈ సమయంలో జారి పడిపోవడంతో ఆమె ఎడమ చేయి విరిగిపోయింది. తక్షణమే మేట్లు చాపర పిహెచ్‌సికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎపిఒ తెంబూరు రవి పని వద్దకు వచ్చి పరిశీలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని బంధువులు తెలియజేశారు.

చిగురువలసలో విషాదం

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

తెలంగాణా రాష్ట్రంలోని మియాపూర్ వద్ద ఓ లారీ సృష్టించిన బీభత్సంలో మండలంలోని చిగురువలసకు చెందిన హోంగార్డు నల్లాన సింహాచలం (40) మృతి చెందాడు. మియాపూర్ కడలి వద్ద ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా ఓ లారీ అతివేగంగా వచ్చి ట్రాఫిక్ విధి నిర్వహణలో ఉన్న పోలీసులను ఢీకొంది. విధి నిర్వహణలో ఉన్న ముగ్గురు పోలీసులు గాయపడ్డాడు. వెంటనే అక్కడే ఉన్న ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సింహాచలం మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. సింహాచలం 15 ఏళ్ల క్రితం అక్కడే హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. సమాచారం అందుకున్న బంధువులు హైదరాబాద్ తరలి వెళ్లిరు. ఆయన తండ్రి త్రినాథరావు ఇటీవల గుండె పోటుతో మృతి చెందారు. గ్రామంలోని మృతిని తల్లి, భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం మృతదేహం స్వగ్రామానికి తీసుకొస్తారని గ్రామస్తులు తెలిపారు.

సింహాచలం (ఫైల్)

రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

ఆర్‌డిఒ పరిశీలన

నందిగాం : మండలంలోని లట్టిగంలో ఉన్న జగనన్న కాలనీని పలాస ఆర్‌డిఒ జి.వెంకటేష్ మంగళవారం పరిశీలించారు. లే అవుట్‌లోని ఇంటి నిర్మాణాలపై ఆరా తీశారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కోమటూరు పరిధిలోని బౌండరీలో ఉన్న బూములను పరిశీలించారు. ఈయనతో పాటు డిటి రామారావు, మండల సర్వేయర్ హనుమంతరావు, ఆర్ఐ సింహాచలం, విఆర్ఒ సురేష్ ఉన్నారు.

మహిళా శిక్షణా కేంద్రంలో ఇద్దరు మహిళలు అదృశ్యం

ఎచ్చెర్ల : మండల పరిధిలో మహిళా కేంద్రంలో శిక్షణ పొందుతున్న మహిళలు అదృశ్యమైనట్లు ఎచ్చెర్ల పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు... టైలరింగ్ శిక్షణ పొందుతున్న బెపల అనూష, చెరుకూరి తిరుపతమ్మ మంగళవారం ఉదయం మహిళా కేంద్రం నుంచి బయటకు వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో శక్తి సాధన సూపరింటెండెంట్ సనపల సత్యవతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తప్పిపోయిన ఇద్దరుకు తల్లిదండ్రులు లేరని ఫిర్యాదుల పేర్కొన్నారు.

ఈదుపురంలో అన్నదానం

ఇచ్ఛాపురం : ఈదుపురంలో శ్రీరామ మందిర ప్రతిష్టను పురస్కరించుకుని మంగళవారం అన్నదానం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, మాజీ ఎంపిపి నర్తు చామంతి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు దక్కత నూకయ్యరెడ్డి, మాజీ ఎంపిపి దక్కత ఢిల్లీరావు పాల్గొన్నారు.

అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

థర్మల్ ప్రాజెక్టు అవసరం

టిడిపి నాయకులు జనార్ధనరావు

ఆమదాలవలస : నియోజకవర్గం పరిధిలోని బూర్జ- సరుబుజ్జిలి మండలాల పరిధిలో గల వెన్నెలవలస వద్ద ఎపి జెన్‌కో నిర్మించనున్న థర్మల్ విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణానికి మోకాలడ్డడం అభివృద్ధికి, రైతుల, గిరిజనుల ప్రగతి, ఉపాధి అవకాశాలను దెబ్బతీయడమేనని టిడిపి నాయకుడు పేడాడ జనార్ధనరావు అన్నారు. మండలంలోని గాజులకొల్లివలస పంచాయతీ శ్రీహరిపురంలో ఆయన స్వగృహంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఆదివాసీ హక్కులు, 1/70 చట్టం పరిరక్షణ పేరిట అసలైన ప్రగతిని అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. దీనివల్ల కలిగే పర్యావరణ కాలుష్యం, ఇతర అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కారించాలని సూచించారు. సోంపేట, కాకరాపల్లి ప్రాంతీయులు కాదంటే వెన్నెలవలసకు ఈ ప్రాజెక్టు మార్చారనడం శుద్ధ అబద్ధమని అన్నారు. ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై అభాండాలు వేయడం కేవలం ఈ ప్రాంతీయుల మనోభావాలను దెబ్బతీయడమేనని అభిప్రాయపడ్డారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కూన అప్పలనాయుడు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు బోనిగ భాస్కరరావు, సీపాన వెంకటరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జనార్ధనరావు

చిరంజీవికి అభినందనలు

పత్రాన్ని అందజేస్తున్న డాక్టర్ సింధూర

శ్రీకాకుళం అర్బన్ : పర్వతారోహణకు రష్యా ఎల్‌బ్రోస్, కిలిమంజీరా వెళ్లనున్న టెక్కలి మండలం కొండభీంపురానికి చెందిన సారా చిరంజీవిని లయన్స్ క్లబ్ ఆఫ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి డాక్టర్ పైడి సిందూర అభినందించారు. లయన్స్ క్లబ్ కార్యాలయంలో దాతల సాయం కోసం వచ్చిన చిరంజీవిని మంగళవారం ఆమె శాలువ కప్పి సత్కరించారు. కన్న కలలు సాకారం చేకునేందుకు పేదరికం అడ్డు కాకూడదని ఆమె అభిప్రాపడ్డారు. పర్వతారోహణ చేయాలన్న లక్ష్యంతో చేసిన ప్రయత్నం సఫలీకృత మవుతోందన్నారు. కఠోర శ్రమతో పర్వతారోహణ చేయడం గర్వకారణమన్నారు. అందులోను శ్రీకాకుళం జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంటారు నటుకుల మోహన్, నంది ఉమాశంకర్ పాల్గొన్నారు.

వృత్తి విద్యలో నైపుణ్యం అవసరం

ప్రజాశక్తి- పాతపట్నం

వృత్తి విద్యలో నైపుణ్యం అవసరమని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి అన్నారు. కళాశాల ఆవరణలో విద్యార్థులకు సాధారణ విద్య, వృత్తి విద్యలో నైపుణ్యంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు వృత్తి విద్య కోర్సుల్లో భాగంగా ఐటి అండ్ ఐటిఇఎస్, ఆటోమోటివ్ కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. వేసవి సెలవుల్లో మీసేవ, టైపు అండ్ జిరాక్స్, కంప్యూటర్ జాబ్ వర్క్స్, ఇంటర్నెట్ సెంటర్స్, ఫోటో స్టూడియోస్, ఫ్లెక్సీ బ్యానర్ సెంటర్స్, కంప్యూటర్ ఇన్స్టిట్యూట్స్, ప్రింటర్ కేర్ అండ్ హార్డ్వేర్ సెంటర్స్ నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో వృత్తి విద్య అధ్యాపకులు ఎన్ని నరేష్ కుమార్, ఎన్.రాంప్రసాద్, సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్లు బి.తిరుపతిరావు, జి.శంకరరావు పాల్గొన్నారు.

13న 'పైల' వర్ధంతి సభ

మెళియాపుట్టి: పలాస టౌన్‌లో ఈ నెల 13న న్యూడెమక్రసీ నాయకులు పైల వాసుదేవరావు 15వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని అఖిలభారత రైతు కూలి సంఘం, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు సవర భాస్కరరావు పిలుపు నిచ్చారు. మండలంలోని ముకుందపురంలో వర్ధంతి సభ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం సాయిధ గిరిజన రైతాంగ పోరాట యోధుడు, అణగారిన ఆదివాసీ, పీడిత, తాడిత ప్రజలకు పోరాడారని అన్నారు. అలాగే జిల్లాల విభజనతో ఐటిడిఎను కోల్పోయామని, మెళియాపుట్టిలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంల ఎఐకెఎంఎస్ మండల అధ్యక్షులు సవర శ్రీను, గౌరేసు, నారాయణ, సవర నూకయ్య, రామస్వామి, ఆదినారాయణ, కృష్ణమూర్తి, అప్పన్న, అప్పారావు, ఆదినారాయణ, శోర్ధన్, మోహనరావు, సోమయ్య పాల్గొన్నారు.

టెక్కలి : వాసుదేవరావు వర్ధంతి సభను విజయవంతం చేయాలని కోరుతూ ముఖలింగాపురంలో అరుణోదయ సాంస్కృతిక సమైక్య జిల్లా కార్యదర్శి కోసంటి సోమేశ్వరరావు, పిఒడబ్ల్యు జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సుహాసిని, సవర బుడ్డయ్య, సుజాత, యోగేందర్‌లు పోస్టర్లను ఆవిష్కరించారు.

టెక్కలి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సోమేశ్వరరావు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి క్యాంప్ కోర్టు

ఆమదాలవలస : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే వినియోగదారుల పరిష్కార న్యాయ స్థానం (క్యాంప్ కోర్ట్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరం చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. మండలంలోని తొగరాం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు విద్యుత్ వినియోగదారుల పరిష్కార న్యాయస్థానంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్యాంప్ కోర్ట్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. విద్యుత్‌పై ఎటువంటి సమస్యలు ఉన్న టోల్ ఫ్రీ నంబరు 1912కు కాల్ చేయాలని సూచించారు. క్యాంపు కోర్టు దృష్టికి వచ్చిన సమస్యను 60 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం ఆమదాలవలస పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో తొగరాం సెక్షన్ కార్యాలయంలో వినియోగదారుల పరిష్కార న్యాయస్థానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరం ఫైనాన్స్ మెంబరు సుబ్బారావు, టెక్నికల్ మెంబర్ సులేఖరాణి, ఇండిపెండెంట్ మెంబర్ మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్‌కుమార్, డిఇఇ బి.రవికుమార్, రూరల్ టౌన్ ఎఇలు రవికుమార్, రామారావు లైన్ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

వినతులను స్వీకరిస్తున్న సత్యనారాయణ

ఆర్‌ఎం వల్లే స్వప్నప్రియ ఆత్మహత్య

జంతర్‌మంతర్ వద్ద కుటుంబసభ్యుల ధర్నా

శ్రీకాకుళం: ఎస్‌బిఐ పూర్వ ఆర్‌ఎం టి.ఆర్.ఎం. రాజు వల్లే అసిస్టెంట్ మేనేజర్ స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆరోపించారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గార ఎస్‌బిఐలో కస్టమర్లు తాకట్టు పెట్టిన బంగారం మాయం కావడం వెనుక అప్పటి ఆర్‌ఎం రాజు పాత్ర కీలకమన్నారు. అయితే ఆయన మాత్రం నెపాన్నంతా స్వప్నప్రియపై నెట్టేసి తెలివిగా తప్పించుకున్నారన్నారు. వీటన్నింటితో మనస్తాపం చెందిన స్వప్నప్రియ ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి రాజుతోపాటు దీనివెనుక సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో స్వప్నప్రియ బంధువులు ఆర్.వి.ఎస్.శర్మ, ఎసిపిడి మురళీ, డబ్బీరు వాసు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న స్వప్నప్రియ బంధువులు

ఇచ్ఛాపురం : పరిశీలిస్తున్న నాగరాణి

పౌష్టికాహారంపై అవగాహన

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీలో పలు వార్డుల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషణ పక్వాడ కార్యక్రమాలను ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగరాణి మంగళవారం పరిశీలించారు. గర్భిణి ప్రసవం అనంతరం తొలి ఆరు నెలల పాటు తల్లిపాలు అందించాలన్నారు. గర్భవతులకు, కిశోరి బాలికలకు రక్త హీనత అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.సుజాత, ఎస్.నీలవేణి, జె.లక్ష్మి, పి.పల్లవి, పి.పుష్పలత, జి.ఖుష్ణవే;ఇ నరసమ్మ పాల్గొన్నారు.

పాతపట్నం : పాతపట్నంలోని గర్భవతులకు, బాలింతలకు, పిల్లలు కౌమార దశలో ఉన్న బాలికలకు పోషకాహారం ప్రాధాన్యతను తెలియజేస్తూ అంగన్వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పిఒ విమలారాణి తదితరులు పాల్గొన్నారు.

11 మంది ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2025లో ఎంబిఎ, బిటెక్ కోర్సులను పూర్తిచేసిన 11 మంది విద్యార్థులు హైదరాబాద్ కేంద్రంగా ఉన్న గెట్మీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు అభ్యర్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్షిక వేతనంగా ఒక్కొక్కరికీ రూ.2.4 లక్షలను ఆ కంపెనీ చెల్లిస్తుందని పేర్కొన్నారు. వీరిని డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ఒడిలు టిపిఒ డాక్టర్ ఎం.ఎన్.వి.ఎస్.ఎస్.కుమార్ అభినందించారు.



ఎంపికైన విద్యార్థులు

అంధకారంలో కాలనీవాసులు

ప్రజాశక్తి- పొందూరు

మేజర్ పంచాయితీ పరిధిలోని పైడిమాంబ కాలనీ (జగనన్న కాలనీ)కి వెళ్లే రహదారిలో విద్యుత్ లైట్లు లేకపోవడంతో తీవ్ర భయాందోళనలు చెందుతున్నారు. పట్టణానికి సుదూరంగా గల పైడికొండ సమీపంలో గత ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో ఇళ్ల నిర్మాణాలు జరిపారు. పట్టణానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో గల ఈ కాలనీకి పగలే రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంటుందని, అలాంటిది రాత్రి వేళలో కారుచీకటిలో రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొన్న దంటూ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా విద్యార్థినులు, మహిళలు సాయంత్రం 6 గంటలైతే చాలు ఎటూ వెళ్లలేని పరిస్థితి. విద్యార్థినులు పాఠశాల, ట్యూషన్‌కు వెళ్లి రావాలంటే చీకటి పడిపోతుందని, దీంతో పెద్దవారు వెళ్లి వారిని తీసుకురావాల్సి వస్తుందంటూ వాపోతున్నారు. అసలే జనసంచారం లేని నిర్మానుష్య ప్రాంతం కావడంతో పాటు, కొండప్రాంతం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచు కొస్తుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పైడితల్లి ఆలయం నుంచి కాలనీవరకూ రహదారి వెంబడి విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ వాటికి బల్బులను ఏర్పాటు చేయకపోవడంతో చీకటిగా ఉంటుందని వాపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ బల్బులను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న జగనన్న కాలనీకి వెళ్లే రహదారి

కాలనీల్లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలోని చాపురం, పాత్రునివలస, పెద్దపాడు పరిధిలోని విశాఖ-బి కాలనీలోని గోవింద్ నగర్, శ్రీనివాస నగర్, మహాలక్ష్మి నగర్, సాయిలక్ష్మి నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం పర్యటించారు. స్థానిక కాలనీ కమిటీలతో కలిసి రోడ్లు, మురుగునీటి కాలువలను పరిశీలించారు. ఇటీవలే ఈ ప్రాంతంలో నివాసముంటున్న పలు కాలనీ సంఘాల ఆధ్వర్యాన కమిషనర్‌కు ప్రజలు వినతులు అందజేశారు. ప్రధానంగా కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణం కాకపోవడం వల్ల వ్యర్థ జలాలు ఖాళీ స్థలాల్లోకి చేరి పెద్దఎత్తున దోమలు వృద్ధి చెంది ప్రజలను ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. కాలనీల్లో సిమెంట్ రోడ్లు లేక ఇప్పటికీ మట్టి రోడ్డులే ఉన్నాయని, కాలువల నిర్మాణం చేపట్టలేదని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరపాలక సంస్థ ఆధ్వర్యాన కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్లను సిసి రోడ్డులుగా మారుస్తానన్నారు. ఆయన వెంట నగర పాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, హెల్త్ ఆఫీసర్ పి.సుధీర్‌కుమార్, స్థానికులు బిర్లంగి రామ్మోహనరావు తదితరులు ఉన్నారు.

బైండోవర్ కేసు నమోదు చేస్తున్న తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

35 మందిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి- పలాస

పలాస ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉన్న పలాస, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో వివిధ గ్రామాలకు చెందిన 35 మందిపై మంగళవారం బైండోవర్ కేసులు నమోదు చేశామని పలాస ఎక్సైజ్ సిఐ మల్లిఖార్జునరావు తెలిపారు. పలాస తహశీల్దార్ కార్యాలయం వద్ద బైండోవర్ కేసులకు సంబంధించి తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణ సమక్షంలో కేసులు నమోదు చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్సై షేక్ సైదాబి తదితరులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా

'ఉపాధి' పనులు పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో కోసమాల, పట్టుపురం గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉంటున్న కారణంగా తగిన ఆరోగ్య జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. మస్తరు ప్రకారం పనుతు చేస్తే కనీస కూలి వస్తుందని వివరించారు. ఈయనతో పాటు ఎపిఒ తెంబూరు రవి, ఇసి ఆదినారాయణ, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

నైర విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

మాట్లాడుతున్న సుధ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నైర వ్యవసాయ కళాశాల విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి కొత్తలంక సుధ అన్నారు. నైర కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యాన శ్రీకాకుళం మండలం శిలగాంసింగువలసలో మంగళవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో పాల్గొన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ బి.రజని పాల్గొని రైతులకు సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పించారు.

కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి, సర్పంచ్ ప్రతినిధి కంచు వసంతరావు, మాజీ సర్పంచ్ కంచు దశరథుడు పాల్గొని విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు ఎస్.గోవిందరావు, స్పందన, కొర్ని జోగులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ జోగినాయుడు, ఉపేంద్రరావు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ఆమదాలవలస : దేశంలో నిరుద్యోగ యువత ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా, యువజన హక్కుల కోసం పోరాటం చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తే దేశం ప్రపంచ దేశాల అన్నింటి కంటే ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. సంపద కేవలం కొంతమంది చేతుల్లో పెట్టడంతో అందరికీ సమాన అవకాశాలు లేకుండాపోతుందన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ నాయకులు ధనుంజయ్, మోక్షిత్, తేజ, సిద్ధార్థ్, నవీన్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శరవేగంగా పాఠశాల ప్రహరీ నిర్మాణం

నిర్మిస్తున్న ప్రహరీ

లావేరు: లావేరు జెడ్‌పి పాఠశాల రక్షణ గోడ నిర్మాణం పనులు శరవేగంగా చేపడుతున్నారు. పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో ఆ మైదానంలో మందుబాబులకు అడ్డాగా మారిపోవడంతో పలుమార్లు 'ప్రజాశక్తి' కథనాలు ప్రచురించింది. ఈ కథనాలపై ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు స్పందించి రూ.54 లక్షల నిధులు మంజూరు చేశారు. అనంతరం పనులు ప్రారంభించారు. ఎస్ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు పర్యవేక్షణలో నిర్మాణం పనులు వేగంగా సాగుతున్నాయి. పాఠశాల ఆవరణలో ఉన్న షాపులను తొలగించడంతో విశాలమైన మైదానం. దాని చుట్టూ 6 అడుగులు ఎత్తున గోడ నిర్మిస్తున్నారు. దీంతో భవిష్యత్ తరాలకు ఉపయోగపడే పాఠశాల అభివృద్ధి పథంలో నడుస్తోంది. పనులు నాణ్యతలోను రాజీలేకుండా చేపడుతున్నామని రాంబాబు తెలిపారు. మరో పది రోజుల్లో పనులు పూర్తవుతుందని తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

ప్రజాశక్తి- రణస్థలం

ప్రతిఒక్కరూ అమ్మ పేరిట మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకుడు ఆర్.హరిబాబు అన్నారు. హరిత సొసైటీ సభ్యులు గొర్లె అప్పలనాయుడు మాతృమూర్తి సత్యవమ్మ పేరిట స్థానిక పాతర్లపల్లి, వెంకటేశ్వర కాలనీలోని శ్రీరామాలయాల ఆవరణలో ఉసిరి, నేరేడు, సపోటా, జామ మొక్కలను మంగళవారం నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై గ్రామాల్లో, పాఠశాలల్లో, కళాశాలల్లో అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హరిత సొసైటీ కార్యదర్శి పి.తవిటినాయుడు, గొర్లె అప్పలనాయుడు, రెల్లి సన్యాసప్పలనాయుడు, రెడ్డి సన్యాసిరావు, గొర్లె సూర్యనారాయణ, రామకృష్ణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న అప్పలనాయుడు

అధ్వానంగా ఉన్న మురుగు కాలువ

అధ్వానంగా మురుగు కాలువలు

పొందూరు: మండలంలోని కోటిపల్లిలో మురుగు కాలువలు చెత్తాచెదారాలతో నిండి అధ్వాన్నంగా మారాయి. గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన గల కాలువతో పాటు, సచివాలయం ముందర గల కాలువలు చెత్తాచెదారాలతో నిండిపోయాయి. దీంతో దుర్వాసనతో పాటు దోమలు బెడద ఎక్కువై అపారిశుధ్యం నెలకొనడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ పరిసర నివాస వాసులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి మురుగు కాలువలలో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించి శుభ్రం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్న సిఐ విజయ్ కుమార్

సైబర్ నేరాలపై అప్రమత్తం

టెక్కలి రూరల్ : సమాజంలో పెరుగుతున్న సైబర్, నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సిఐ అంబటి విజయకుమార్ అన్నారు. మండలంలోని నర్సంగిపల్లి పంచాయతీ నరహరిపురంలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై మంగళవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో ఎక్కువగా సైబర్ నేరాల బారిన యువత పడుతున్నారన్నారు. ఏదైనా సమస్య ఎదురైతే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనదారులకు అన్ని ధ్రువపత్రాలు ఉండాలన్నారు. తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదన్నారు.

ప్రారంభిస్తున్న సాయిరాం దంపతులు

నూతన భవనం ప్రారంభం

రణస్థలం: మండల కేంద్రంలోని ముత్యాలమ్మ తల్లి కళావేదిక నూతన భవనాన్ని మేమున్నాం సేవా సంఘం అధ్యక్షులు పచ్చిగుళ్ల సాయిరాం, ఎంపిటిసి దేవయాని మంగళవారం ప్రారంభించారు. అలాగే ముత్యాలమ్మ తల్లి జాతర 21వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ కమిటీ సభ్యులు యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మూడు రోజులు పాటు పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించునన్నారు. జాతరను ఐసిడిఎస్ పిఒ ఝాన్సీ, కోష్ట సచివాలయం మహిళా పోలీస్ బి.అమ్మెజీ సందర్శించారు.

కుప్పగా ఉన్న చెత్తా చెదారం

కంపు కొడుతున్న టెక్కలి

టెక్కలి రూరల్ : టెక్కలి మేజర్ పంచాయతీ పారుశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో విధులకు హాజరు కావడం లేదు. దీంతో టెక్కలిలో పారిశుధ్య పనులు నిలిచిపోవడంతో ఎక్కడకక్కడే చెత్త కుప్పలు దర్శనమివ్వడంతో కంపుకొడుతుంది. రెండు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో మంగళవారం నుంచి విధులకు హాజరు కావడం లేదు. కార్యదర్శి కె.వి.వి.జగన్నాథరావు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయాడు. ఎఫ్ఎసి బాధ్యతలు కూడా అప్పగించలేదు. దీంతో ఎక్కడి సమస్య అక్కడే ఉంది. అధికారులు స్పందించి కార్యదర్శి నియమించి కార్మికులు జీతాలు చెల్లిస్తే తప్ప పరిష్కారం కాదుని పలువురు చర్చించుకుంటున్నారు.

అధ్వానంగా రోడ్డు

ఎచ్చెర్ల : మండలంలోని వెంకటాపురం-యాతపేట రోడ్డు అధ్వానంగా తయారైంది. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వెంకటాపురం, యాతపేట నగర కార్పొరేషన్‌లోకి విలీనం కావడంతో నిర్మాణానికి నోచుకోలేదు. పాలకులు, అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల క్రితం సిసి రోడ్డు నిర్మించడంతో గోతులమయమైంది. సిసి రోడ్డు వేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.